ఖరీఫ్‌లో జోరుగా వరినాట్లు

- నది పరీవాహక గ్రామాల్లో వరిసాగు
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు


వరిపొలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కొండాపురం : ఖరీఫ్ సీజన్ కావడంతో మండల పరిధి చిత్రావతి నది సమీపంలోని ఏటూరు, కె.రామిరెడ్డిపల్లె, పొట్టిపాడు, బెడుదూరు, యనమలచింతల తదితర గ్రామాలు, అలాగే పెన్నానది పరివాహక గ్రామాలైన టి.కోడూరు, సంకేపల్లె, అలాగే పై డి పాళెం ప్రాజెక్టు కింద లావనూరు తదితర గ్రామా ల్లో వరిపంట సాగుకు రైతులు సద్ధమయ్యారు. అ లాగే బోరుబావులకింద కూడా వరి సాగుకు రైతులు సిద్ధమయ్యారు. మొత్తం 720 ఎకరాలలో పంటను సాగుచేస్తున్నారు.

అధిక పెట్టుబడులతో తల పట్టుకుంటున్న రైతులు

గత వైఎస్సార్ ప్రభుత్వంలో పెట్టుబడి సాయం ఏ సీజన్‌కు అదే సీజన్‌లో అందేది. టీడీపీ ప్రభుత్వం వచ్చి రెండు నెలలు అయినా రైతులకు చెప్పిన అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఆర్థిక సాయం అందలేదు. దీంతో రైతులు సాగుకు అయ్యే కర్చు ఎక్కువ అవుతోంది. సకాలంలో పెట్టుబడి అందక ఇబ్బందుల పడుతున్నారు. ఎకరా వరినాటు వేయడానికి రూ.5వేలు, దుక్కి, రోటోవేటర్ వేయడానికి రూ.3 వేలు, ఎద్దులతో చదును చేయడానికి, గేనా లు పెట్టడానికి రూ.2500, రసాయన ఎరువుకు రూ.7 వేలు, క్రిమిసంహారక మందులు రూ.5 వేలు, వరి పొలంలో రెండు సార్లు కలుపు ఖర్చులు రూ.3 వేలు, వరి కోతకు రూ .2500 వరకు కానుంది. దీంతో ఎకరానికి రూ.28 వేల వరకు పెట్టుబడి వస్తుంది.


ఎద్దులతో పొలాన్ని చదును చేస్తున్న దృశ్యం


ట్రాక్టర్‌తో రోటోవేటర్ చేస్తున్న రైతు

వరిసాగుకు అధిక ఖర్చులు వస్తున్నాయి



వరి సాగు చేయాలంటే ఎకరాకు రూ.30 వేలు ఖ ర్చు వస్తోంది. వాతావరణం అనుకులిస్తే ఎకరానికి 25 నుంచి 30 బస్తాలు దిగుబడి వస్తుంది. తెగులు సోకితే దిగుబడి తగ్గడంతో పాటు ఖర్చులు పెరుగుతాయి. గత ప్రభుత్వంలో పెట్టుబడిసాయం అందేది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం సాగుచేసే వరి రైతులకు ఆర్థికసాయం అందించాలి.

–పి.రాజకుల్లాయప్ప, రైతు, బిడుదూరుగ్రామం

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు తగిన యజమాన్య పద్ధతులు పాటించాలి. రైతులు విచక్షనారహితంగా రసాయన ఎరువులు క్రిమిసంహారక మందులను వాడరాదు. నత్రజని ఎరువులను తగ్గించాలి. క్రిమిసంహారక మందులను కూడా తక్కువగా వాడాలి. నిత్యం వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. వరి పొలంలో బాటలు తీయటం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడ పీడల ఉధృతి తగ్గుతుంది. దీంతో అధిక దిగుబడులు వస్తాయి.

– మండల వ్యవసాయ అధికారి రామంజులరెడ్డి, కొండాపురం

పత్తిపంట పరిశీలన


పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిని నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : పెద్దరంగాపురం సమీపంలో రైతు అంకాల్‌రెడ్డికి సంబంధించిన పత్తి పంటను మంగళవారం వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి పరిశీలించి మాట్లాడారు. పత్తిపంటను పులివెందుల ప్రాంతంలో రైతులు విస్తారంగా సాగుచేశారన్నారు. పత్తిలో పచ్చదోమ ఎక్కువగా ఉండటం వల్ల ఎకరాకు 25 పసుపు పల్లాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే పచ్చదోమ, తెల్లదోమ నివారణకు 2 లీటర్ల వేపనూనెను 2 లీటర్ల కానుగ నూనె, 30 గుడ్లు, 500 లీటర్ల నీటిలో కషాయాన్ని తయారు చేసి పిచికారి చేయాలన్నారు. పత్తిపంటను సాగు చేసిన రైతులు సంబంధిత అధికారులు చెప్పే సూచనలు, సలహాలను పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చునన్నారు. పత్తిసాగు చేసినప్పటి నుంచి అధికారులు చెప్పే మందులు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే, ఆర్ఎంఓ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాగ్రత్తలతో ఆరోగ్య పరిరక్షణ


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వల్లూరు : విద్యార్థినులు తగిన జాగ్రత్తలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో మంగళవారం విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి, పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, విద్యాలయం ప్రిన్సిపాల్ నసీమున్నీసా, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ పాయింట్ల కోసం పరిశీలన


ఇసుక రీచ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు, మైన్స్ అధికారులు

కొండాపురం : చిత్రావతి నది పరిధిలోని కొండాపురం, పెంజిఅనంతపురం గ్రామాల్లో ఇసుక రీచ్ పాయింట్ల కోసం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, కడప మైన్స్ అధికారులు పరిశీలించినట్లు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. కలెక్టర్ అదేశాల మేరకు మండలంలోని యర్రగుడి గ్రామం వద్ద పెన్నా నదిలో ఇసుక రీచ్ పాయింట్లను రెవెన్యూ, మైన్స్ అధికార బృందం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగప్రసాద్, ఆర్ఐ ఆనంద్, ఎస్ఐ యోగేంద్రలు పాల్గొన్నారు

గడ్డివాము దగ్ధం


దగ్ధమైన గడ్డివామును చూపిస్తున్న శ్రీనివాసులు

వేంపల్లె : స్థానిక రాజాతోట వీధిలో ఉన్న శ్రీనివాసులు అనే వ్యక్తికి చెందిన గడ్డివాము దగ్ధమైంది. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఒక్కసారిగా మంటలు ఎగసిడటంతో విషయం తెలుసుకున్న స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఫైర్ ఇంజన్ తీసుకొచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోతున్నాడు. ఇది ఆకతాయిల పనేనని బాధితుడు అంటున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందేలా చూడాలని వేడుకుంటున్నాడు.

మౌలాలి పీర్ల గ్రామోత్సవం


గ్రామోత్సవంలో మౌలాలి స్వామి

పెద్దముడియం : మండలంలోని చిన్నపసుపుల గ్రామంలో మంగళవారం మౌలాలిస్వామి జాతర పీర్ల పండగ ఘనంగా నిర్వహించారు. భక్తులు చదివింపులు చదివించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి


మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మికులు

ఎర్రగుంట్ల : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్మికులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిర్మాణ రంగాన్ని బలోపేతం చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. జీఓ నంబరు 17ను రద్దు చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా ఉచితంగా పనిముట్లు ఇవ్వాలన్నారు. వృత్తి పరమైన సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు.

నాణ్యమైన విద్యను అందించండి

పులివెందుల రూరల్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప తెలిపారు. మంగళవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు అన్ని సదుపాయాలు కల్పించాలన్నా రు. అనంతరం పాఠశాలలోని తరగతి గదుల ను, వంటశాలలను పరిశీలించారు. హెచ్ఎం కమల్నాథ్‌శర్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి


మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

కమలాపురం : వర్షా కాలం కావడంతో తాగునీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డీపీఓ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, పన్ను వసూళ్లపై సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా డ్రైనేజ్, తాగునీటి పైప్‌లైన్ కలువ కుండా చూడాలన్నారు. తాగునీరు కలుషితం అయ్యే డయారియా తదితర రోగాలు ప్రబలుతాయన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టగానే బ్లీచింగ్ ఫౌడర్ చల్లాలన్నారు. అలాగే తాగునీటి, ఆస్తి పన్నులు 100 శాతం వసూలు చేయాలన్నారు.

పీఆర్ వన్ మొబైల్ యాప్, ఓడీఎఫ్ తదితర వాటిపై క్షుణ్ణంగా సిబ్బంది వివరించారు. కార్యక్రమాలపై వెనుక బడిన సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమణారెడ్డి, ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ శారదారెడ్డి, డీఆర్‌పీ రాఘవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వరి పంటలో కాలిబాటలు తప్పనిసరి


పుట్లంపల్లె వద్ద వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : వరి పంటలో కాలిబాటలు తప్పనిసరిగా తీయాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని పుట్లంపల్లెలో సాగులో ఉన్న వరి పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి పంటలో ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. చొప్పున కాలిబాటలు తీస్తే అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. కాలిబాటల ద్వారా పంట పొలంలో గాలి, సూర్య రశ్మి బాగా ప్రసరించి ప్రధానంగా సుడిదోమ పురుగును నివారించవచ్చన్నారు. ఎరువులు పురుగు మందుల పిచికారికి కూడా కాలి బాటలు ఎంతో అవసరం అని ఏడీఏ వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏ ఇందిర, రైతులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి అభిషేక హోమాలు


స్వామి వారికి అభిషేక హోమాలు చేస్తున్న భక్తులు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఆలయంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్లకు అభిషేక హోమాలు నిర్వహించారు. మంగళవారం ఆషాఢ కృత్తికను పురస్కరించుకుని వేద పండితుల మంత్రోచ్ఛారణలతో స్వామి వారికి శాస్త్రోక్తంగా అభిషేక హోమాలు నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.


వేంపల్లెలో పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

వేంపల్లెలో

వేంపల్లె : స్థానిక గాండ్లవీధిలో వెలసిన వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యే పూజలు నిర్వహించారు. మంగళవారం కృత్తిక నక్షత్రం సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు శేషగిరిరావు నేతృత్వంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఇచ్చే బహుమతి నేత్రదానం


కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను సేకరిస్తున్న రాజు

వేంపల్లె : సమాజానికి మనమిచ్చే ఆఖరి బహుమతి నేత్రదానమని స్నేహిత అమృతహస్తం నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు తెలిపాడు. స్థానిక బొడ్డువాండ్ల వీధికి చెందిన మొగలి రామసుబ్బమ్మ మృతి చెందింది. ఆమె కుంటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించడంతో టెక్నీషియన్ హరీష్ కార్నియాలను సేకరించి అగర్వాల్ నేత్రనిధికి పంపారు. నేత్రసేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు వయసు పరిమితం కాదన్నారు. మరణానంతరం ఆ కుటుంబ సభ్యులు నేత్రదానం చేయాలనే సంకల్పం ఉంటే 9966509364, 7093204537 సమాచారం అందించాలన్నారు. అంధ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

ప్రకృతి పద్ధతులతో అధిక దిగుబడులు


ద్రవ జీవామృతాన్ని పరిశీలిస్తున్న ఏఓ ఓబులేసు

పెండ్లిమర్రి : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మంగళవారం పెండ్లిమర్రి గ్రామ పొలాల్లో మహిళా రైతు పద్మావతి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వంగ పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో తయారు చేసిన ఘన జీవామృతంను వాడటం వల్ల భూమిలో భూసారాన్ని పెంచుకోవచ్చునన్నారు. అలాగే తెగుళ్లు, చీడపీడల నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన నీమాస్రంను పిచికారి చేయాలన్నారు. అనంతరం మహిళా రైతు తయారు చేసిన ద్రవ జీవామృతంను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, వీహెచ్ఏ వసంత, ఎన్ఎఫ్ఏ సందీప్, ఎంటీ గంగిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం (చెన్నూరు) : చెన్నూరు మండలం ఓబులంపల్లి పంచాయతీలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మీకు ఎలాంటి సమస్యలు ఉన్న నేను అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో చెన్నూరు మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, చెన్నూరు మండలాధ్యక్షుడు చీర్ల సురేష్‌యాదవ్, ఉప్పరపల్లె ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, ఓబులంపల్లి సర్పంచ్ చల్లా వెంకటసుబ్బారెడ్డి, నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


అధికారిపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిపించి ఉత్తీర్ణత చేయిస్తామని విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న మైలవరం గవర్నమెంట్ ఐటీఐ కళాశాల ఎలక్ట్రిషియన్ శిక్షణ అధికారి కిరణ్‌పై అధికారులు చర్యలు చేపట్టాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీఐ కళాశాలలో ట్రైనింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కిరణ్ విద్యార్థుల నుంచి రికార్డ్‌ల పేరిట రూ.2వేలు వసూలు చేయడం దారుణం అన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విచారించి విద్యార్థుల నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇప్పించాలని ఆయన కోరారు.

ఘనంగా చిన్నపీర్ల పండుగ

కొండాపురం : మండలంలోని బెడుదూరు, యనమలచింతల గ్రామాల్లో చిన్న పీర్ల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడి వద్ద పీర్లను కొలువుదీర్చారు. కుల్లాయిస్వామికి చెక్కెర చదివింపులు చదివించి భక్తులు మొక్కుబడులను తీర్చుకున్నారు.

చీనీ టన్ను ధర రూ.19 వేలు


విక్రయాలు జరిపేందుకు సిద్ధంగా ఉన్న చీనీకాయలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్‌లో చీనీ కొనుగోలు ధర మంగళవారం రూ.19 వేలు పలికింది. పులివెందుల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు పండించిన చీనీకాయలను పులివెందులలోని చీనీ కాయల మార్కెట్‌కు తరలించి వేలంపాట ద్వారా చీనీకాయలు విక్రయాలు జరిపారు. 196 టన్నులు చీనీకాయలు మార్కెట్‌కు వచ్చినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. కనిష్ట ధర రూ.10,100లు, మధ్యస్థ ధర రూ.14,100లు, అధిక ధర రూ.19,100లు పలికినట్లు అధికారులు తెలిపారు. రైతులు పండించిన చీనీ కాయలను యథావిధిగానే మార్కెట్‌కు తరలించి వేలంపాట ద్వారా విక్రయాలు జరుపుకోవచ్చన్నారు.

పన్నులను క్రమబద్ధీకరించేందుకు కృషి చేయండి


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : గ్రామాలలో ఇంటి పన్నులను క్రమబద్ధీకరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల ఎంపీడీఓ సభాభవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్ల్‌తో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా చూడడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జాషువా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయశేఖర్, డీఎల్‌పీఓ రమణారెడ్డి, ఈఏపీఆర్డీ రంతుల్లయ్య, రీసోర్స్ పర్సన్ దేవేంద్రలు పాల్గొన్నారు.

సమస్యలపై వెంటనే స్పందించండి


యూజీడీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే స్పందించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక భాకరాపురం జయమ్మకాలనీలో యూజీడీ సమస్యపై వచ్చిన ఫిర్యాదుపై ఆయన వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా ఆయన పబ్లిక్ హెల్త్ ఇంజనీర్‌తో కలిసి ఆ ప్రాంతాలలో పర్యటించారు. ప్రజలు చేసే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అలాగే సచివాలయాల్లో జరుగుతున్న సర్వీసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్తిపన్ను, నీటిపన్ను 100 శాతం వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.

ఇంటి వద్దకే పింఛన్లు

ఆగస్టు 1వ తేదీన వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లు గీత, వికలాంగుల పింఛన్లు ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది ద్వారా అందిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. లబ్ధిదారులందరు ఇంటి వద్దనే అందుబాటులో ఉండి పింఛన్ తీసుకోవాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారి సిద్ధయ్య

వేముల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి తెలిపారు. మంగళవారం వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేల్పులలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. లార్వా నిర్మూళన కొరకు డ్రైడేని పాటించాలన్నారు. పనికిరాని గుంతలను, లోతట్టు ప్రదేశాలను, వాడని బావులను పూడ్చి నీరు నిల్వకుండా చూడాలన్నారు. చెత్తాచెదారం మురుగు కాల్వల్లో చేరకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వీణా కుమారి, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరీ, ఆశాకార్యకర్త శాంతి పాల్గొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముద్దనూరు : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం నిధులతో మినీ గోకులాల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న యూనిట్లకు యజమానులు దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీనివాస మంగళవారం తెలిపారు.

2 పశువుల మినీ గోకులం యూనిట్ విలువ రూ.1లక్షా15వేలు, ఇందులో రైతు వాటా రూ.11,500, 4 పశువుల మినీ గోకులం యూనిట్ విలువ రూ.1లక్షా85వేలు ఇందులో రైతు వాటా రూ.18,500, 6 పశువుల యూనిట్ విలువ రూ.2లక్షల30వేలు కాగా ఇందులో రైతుల వాటా రూ.23వేలు చెల్లించాలని పశువైద్యాధికారి తెలిపారు. వీటితో పాటు గొర్రెలు, మేకలు, కోళ్ళ ఫారం షెడ్లు నిర్మించుకోవడానికి 70 శాతం రాయితీ కేటాయిస్తారన్నారు. ఇతర వివరాలకు అందుబాటులో వున్న పశువైద్యాలయంలోకాని, రైతు సేవా కేంద్రాల్లోకాని సంప్రదించాలని ఆయన తెలిపారు.

